# పాలెంలో బొమ్మలాట

ఎంకటసుబ్బయ్యగోరి బుడ్డజీతగాడు సూరాయి నెత్తిన కండవా ఏసుకుని ముక్కు ఎగదోసుకుంటా లోన ఏందేందో గొనుక్కుంటా సత్రంకాడ రావి సెట్టుదెగ్గిర కొచ్చేతలికి ఆడ తోలుబొమ్మలాట పందిరి అప్పుడే లెగిసి కూకుండది. పందిరి అట్టసూసీసూడకతలికే నీలకుండ పగిలి నీలుకార్నట్టు సూరాయి పానం అటనే దిగజారిపోయింది.

అసలు సూరాయి యిసువంటి బొమ్మలాటలు సూసే పద్ధతే వేరు. బొమ్మలాట ఆడేనాటికి పద్దినాల ముంగల బలానిదినం, బలాని సోట, బలాని ముటావోరు బలాని తోల్బొమ్మలాట ఆడ్తారని వూరికి ముంగల సూరాయి పెతోరికీ సెప్పాల. ఆ మయిన ముటావోరు వూళ్ళో కొచ్చి దిగినాక ఆ రందర్తో పరాసి కాలాడ్తా, దెగ్గిరదెగ్గిర తీరిచి పందిరి ఏసేయాలా! బొమ్మలాట మొదలుబెట్టే ముంగలా కుర్రసంచును పందిరి సాయలకు రానీకుండా ఓ కోపు కాత్తా, మద్దెమద్దె ముటావోర్కి వుసారెక్కిత్తా వుండాల అసువంటి పద్ధతి యిప్పుడు పెడదిరిగింది.

ఎప్పుడో పద్దినాలకి ముంగలే తెల్చింది సూరాయికి నాంచారిముటా వొచ్చి పాలెంలో సత్రంకాడ రావిసెట్టుకింద బొమ్మలాట ఆడబోతుండారని, ఈ సమాశారం అట్ట తెల్చిందో లేదో ఎంటనే సూరాయి గెహించాడు. అయ్యో తనని ఎంకటసుబ్బయ్యగోరింటో జీతానికి కుదురుస్తా ఆరి గొడ్డసాయిట్లో గొడ్డతోబాటు కట్టేసిపొయ్యాడని.

కన్నీకటి పడే యాలకి పుగాకుపాయలు సీల్సుకుంటా ఏంకటసుబ్బయ్యగోరు పాలెంలో బొమ్మలాట యవారాలేందో యిశారిద్దామని బయలెల్లి అట్ట మలుపు తిరిగాడో లేదో సూరాయి గొడ్డసాయిట్టోంచి సల్లగా జారి సత్రంకాడి కొచ్చి నిలబడ్డాడు.

తెల్లారి నాంచారి ముటా సెరువుగట్టుమీదగుండా పాలెంలోకి రాటం గొడ్డసాయిడి గోడెక్కి ఎప్పుడో సూశాడు సూరాయి. ఇంకూసేపటికి నాంచారి ముటా బాపనయ్య బజార్లోకొచ్చి వొత్తావుంటే ఎనికెడ్తే కొండాయి, కోటాయి, కాంతాయి, రంగాయి,

రత్తాయిల్తోబాటు జడెర్కుంటా సీతాయి రావటం సూసిన సూరాయి సాయిడిసూరుకు అటనే కరుసుకుబొయ్యాడు.

నాంచారి ముటా పాలెంలోకి జేర్నట్టు తెలిసి మోత లెగిసి పోతావుంటే, యీడ గొడ్డసాయిట్టో సందేలదాకా నెవరేత్తాకూకుండ సూరాయి ఎంకటసుబ్బయ్య గోరు అట్ట ఎల్లి సందు తిరగనే తిరిగేతలికి కూతకూసి ఎలకాడోచ్చిపడ్డట్టు సత్రంకాడి కొచ్చి పడ్డాడు.

అయితే ఏం-పందిరి అప్పుడే లెగిసి కూకుండది. తన సెయి తగలందే ఆ పందిరి లెగిసి కూకుండది! మందనించి దారి దప్పిన దూడకమిల్లే పందిరి సుట్టూతా సూత్తుండ సూరాయికి పందిరికి కాత్తె పెడగా కోపుగాసిన పోలీసులకి మల్లే కొండాయి, కోటాయి, కాంతాయి, రంగాయి, రత్తాయిలు సోల్పున నిలబడుంటం వయినంగా అగుపించింది. ఒక్కపాలి యీపుమీన బురదమట్ట పాకినట్టయింది సూరాయికి.

అయ్య తనని ఎంకటసుబ్బయ్యగోరి గొడ్డసాయిట్టో కట్టెయ్యకనేబోతే తనకన్న ముంగలగా కొండాయి ముటా ఆవజాన ఆడ నిలబడుండేదేనా?

'ఆర్నీ సూరాయి!' అనరిశారు కోటాయి, కాంతాయి, రంగాయి, రత్తాయిలు.

"ఆళ్ళదే యీడ పెత్తనం. తనని పదామడ ఎనిక్కి నెట్టారాళ్ళు' అనుకుండాడు సూరాయి.

'ఓరి రార్రార సూరాయోవ్!' అనరిశారు కొండాయి ముటా.

'ఆళ్ళయ్యోళ్ళు ఆళ్ళని యాడికి బోతానంటే ఆడికి పోనిత్తారు, ఆళ్ళయ్యోళ్ళు మంచోళ్ళు' అనుకుండాడు సూరాయి.

'ఇంటికెల్లి యిప్పుడే వొత్తాలేరా!' అంటా సూరాయి అట్ట ముంగలికి ఒక్క అడుగు ఏశాడో లేదో లంబాడి కొట్టుపక్కనుంచి కడ్డీకిమల్లే వొత్తుండ ఎంకటసుబ్బయ్యగోరు అట్ట అగుపించేతలికి, యిగ అట్టనే ఎనిక్కి తిరిగి లగెత్తిన లగెత్తడం రత్తమ్మ సందుమలుపుకాడి కొచ్చిపడ్డాడు సూరాయి.

'ఒరేయి!' అంది మలుపు మొత్తనుండ ఆ యిగ్రహం.

'అమ్మ సత్తిన్రో రయ్యో' - అంటా అటనే ఆ యిగ్రహమ్మీనకు వొరిగాడు సూరాయి సీకట్లో ఏది ఏదయిందీ తెలవక.

'అమ్మ సంపావురా సూరాయి' అందా యిగ్రహం సూరాయిని గెట్టిగా వాటేసుకుంటా.

'ఎవురూ?' అన్నాడు సూరాయి యిగ్రహం జడ సేతికి తగిలేతలికి కాత్తె తెప్పరిల్లుకుంటా.

'సీతాయిన్రా నేనూ, సంపితివిగదంట్రా సూరాయ్'

'సీతాయ్! నువ్వేనంటే?'

'నేనేరా సూరాయ్.'

'ఆసి నువ్వేనంటే నిజంగా? అడలుకు సత్తినిగదంటే దెయ్యం పీకనే పీకిందనీ'

'ఛీ సచ్చినోడా అరవమాక'

'అరవన్లే సీతాయ్, ఇదిగో, ఏందే నువ్వీడ సేత్తుండదీ?'

'నువు అట్నుంచి లగెత్తుకురావటం సూసి యీడ యిట్ట నిలబడ్డానూ, ఆమైన నువొచ్చి మాట యినిపిచ్చుకోకుండానే మీదబడ్తివి!'

'సంపావుగదటే!'

'సాల్లే వూర్కో - ఇంకా మీనబడి సూడయ్య పాపం!'

'తెలవలేదులేయే సీతాం - దెబ్బ తగిలిందంటే! పానీలే, మరి ఎందుకే మూల నుంచుండావూ!'

'నీ కోసమేరా'

'నా కోసమంటే!'

'అవున్రా'

'ఎందుకే నాకోసం?'

'ఒరే సూరాయోవ్, నే బొమ్మలాట కెల్తుండాగా!' అంది సీతాయ్.

'యేందీ!' అన్నాడు సూరాయ్.

'నే నాంచారయ్య బొమ్మలాట కెల్తుండాగా! మా జేజి నన్ను తీసికెల్తానంది' అంది సీతాయి.

'నిజంగానంటేఁ!'

'నిజంగానేరా, కావాలంటే మా జేజి నెల్లి అడుగు తెల్చుద్ది.'

'మీ అయ్య ఎల్లమన్నాడంటే!'

'అయ్యా, మా అమ్మా అంతా ఎల్లమన్నారు నన్ను.'

'పానీలేవే సీతాలు, నీకేం, నువ్వు ఎట్టనన్నా ఎల్తావు.'

'అదేందిరా సూరాయ్! మరి నువుగూడా రాటం లేదంట్రా!'

'మా అయ్య నన్ను పోనీడు.'

'ఎందుకని పోనియ్యడ్రా మీ అయ్య నిన్ను.'

'ఎంకటసుబ్బయ్యగోరి గొడ్డసాయిడి యిడిసి రావద్దంటాడు.'

'అదేందిరా! బొమ్మలాటన్నా సూడనీయడంట్రా మీ అయ్య'

'నీకు తెలవదులేయే మా అయ్య సంగతీ.'

'మొదులు నీ వడిగావంట్రా మీ అయ్యనూ!'

'నే నడక్కేంది! ఎందుకనమ్మా, నాలుగు తన్నించుకోనా!'

'ఉత్తినే తంతాడంట్రా మీ అయ్యా'

'ఉత్తినే ఏం తంతాడో తెలవదుగాని – ఎట్టానబ్బా!'

'ఎట్టనేందిరా ఎల్లి అడక్కా, మొదులు అడక్కుండానే ఎట్నాంటాడేం! ఒరేయ్, అంతమంది బొమ్మలాట సూత్తారు, నువు సూత్తే మీ అయ్య తప్పంటాడంట్రా'

'అనడనుకో, మరి యీ ఎంకటసుబ్బయ్యగోరి గొడ్డసాయిడి సంగతేమంటా?'

'ఆళ్ళు మటుకు రారంట్రా బొమ్మలాట సూడనూ'

'ఎందుకు రారూ! ఆళ్ళొచ్చే నన్ను గొడ్డసాయిట్టో పండుకోమంటారు.'

'ఏందిరా అనేదీ, ఆరి గొడ్డసంగతి ఆరికన్నా నీ కెక్కువెట్టా!'

'బలేదానివే. యింకా నయం. ఐతే నాకు డబ్బిచ్చి జీతానికి పెట్టుకుండది పని ఎగ్గొట్టమనెట్టా'

'ఎవు రన్నారూ, రేత్తిరి గొడ్డు నిదరబోతుంటే నువ్వాడ దేనికంటారుగాని, ఒరేయ్ బొమ్మలాటన్నా సూడకబోతే యింగ నువేం మడ్సివిరా?'

'అదే సూత్తుండా, పేసీ ఒత్తే ఎట్టనబ్బా–'

'ఎ హె ఏం పేసీ రాదులే. ఒక్కపూట– అందుట్లో యిట్టాటి సమయంలో ఎల్లి అడగరా మీ అయ్యనీ. మీ అయ్య మంచోళ్ళేరా నాకు తెల్సు.'

'ఏం మంచో నాకు తెలవడంలా–'

'సక్కగా మా జేజి వొళ్లో పొందుకుని, తెల్లార్లూ బొమ్మలాట సూత్తా' అంటున్నది సీతాయి.

'ఆఁ సూశావులే' అన్నాడు సూరాయి.

'రావణాయుద్ధం సెబతాడంట నాంచారయ్య. అబ్బ! నుప్పు ల్లెగాల్సిందేనంట. నాంచారయ్య అల్లుడు కేతిగాణ్ణి పద్దే కడుపుబ్బి పోవాల్చిందేనంట. నాంచారయ్య పెల్లాం బంగారక్క పాటలు బహు యిసురుగా పాడుద్దంట. సెన్నాపట్టందాకా మోత బుట్టిందంట నాంచారయ్య బొమ్మలాటంటే–' అనుకుంటున్నది సీతాయి.

'ఇదిగో సీతాయోవ్–' అన్నాడు సూరాయ్ కాకబుట్టి.

'ఓరి పోరా, నీకన్న ఆ కొండాయోళ్ళే నయం' అంది సీతాయి.

ఇదిగో, ఇయాల అరహర బెమ్మదేవులు అడ్డం ఒచ్చి నిలబడ్డాచరే, యీ నక్కా సూరాయి బలాని సత్రం కాడ, రావిసెట్టు ఇవకడ, ఏపసెట్టు వాలుకొమ్మ మీన కూకుని, నాంచారయ్య బొమ్మలాట గనక సూడకనేబోతే– హారావణా!' అంటా గిరుక్కున సెక్రం దిరిగినట్టు తిరిగి బఁయ్‌మంటా యింటేపు లగెత్తుకెల్లాడు సూరాయి; సీతాయి అటనే నోరు దెరుసుకు సూత్తుంటే.

ఆమయిన యియాల బొమ్మలాట యవారం ఐసాపైసా తేలవాల్సిందేననుకుంటా వుసిమీన ఇంటికాడిదాకా వచ్చిన సూరాయి యింటిముంగల అరుక్కాడ అటనే జారిపొయ్యాడు, అంతరిచ్చాన దారం తెగిన గాలిపటానికిమల్లే.

ఇంటో అయ్య వుండాడు. అమ్మా, అయ్యా ఏందో జోరుమీన మాట్టాడ్తుండారు. ఇగ అటనే అరుగు మొత్తకాడ సీకట్లో నక్కాడు సూరాయి.

"ఏందయ్యోవ్ పెట్టిలోంచి ఎర్రకండవా తీత్తుండావ్? అంటుండది అమ్మ.

"తీత్తే తీశార్లే, నువాడ కూకో. పెతిదీ నీకు కావాల్సిందే నెట్టా?' అంటుండాడయ్య.

'పెతిదీ ఎవురిగ్గావాలా? రేత్తిరిపూట పెట్టిలోవుండ ఎర్రకండవాతో ఏం పనొచ్చిందా అనడిగా, తప్పెట్టా?' అంది అమ్మ.

"ఎవుడన్నాడు తప్పనీ, దురగమ్మకుమల్లే ఆడేదో మూలకూకుండా వనుకుంటే అప్పుడే తగుల్కొంటివి. వూరకనే పెట్టిలో వుంటే ఏసుకుంటుండా. కొనుక్కు తెచ్చుకుండది ఏసుకుంటానికి కాదెట్టా?" అన్నాడు అయ్య.

"ఏసుకుంటే ఎవురి కేం బట్టిందీ, ఇన్నాలనించి పెట్టిలో వూరకనే ఉండదిగా, ఈరేత్తిరేం పనొచ్చిందీ?" అంది అమ్మ.

"బువదిన్నాక ఎంకయ్య ఓపాలి రామంటే ఎల్తుండాలే- సానా పనుండది - నువ్వూరికే బురదమట్ట ఎగిరిన ట్టెగరమాక" అన్నాడు అయ్య.

"బురదమట్ట గిరదమట్ట అనమాక. అయితే ఎంకయ్య ఎఱ్ఱకండవా ఏసుకుని గాని రావద్దన్నా డెట్టా?" అంది అమ్మ.

"ఎహె రమ్మన్లేదులే, రేక్కంప తగుల్కుండట్టు తగులుకుండావూ. పెట్టిలో సెదపురుగేమన్నా సేరిందేమోనని సూసి, పానీగందా అని వూరకనే కండవా కండవా ఏసుకుంటే రాగం మొదులుబెట్టావే యిడవకుండా?" అన్నాడు అయ్య.

"ఆహాc, అట్టనా! అయితే కూసేపుండు, నా ఆకుపచ్చ కోక గూడ సెదలేమన్నా పట్టినయ్యేమో సూడనీ-"

"సెదలేం పట్టలేదుగానీ ఇపుడు నీ కోకలు గీకలేం తియ్యమాక-అహc- అదేందీ పచ్చకోక కట్టుకుంటుండదీ?" అంటున్నాడు అయ్య.

"వూరకనే కట్టుకుంటుండాలే. కోకలు కొనుక్కుండది కట్టుకుంటానికాదెట్టా? వుండట్టా" అంటున్నది అమ్మ.

"ఇదుగో - అదేందీ తలగూడ దువ్వద్దే - ఇదిగో ఏందమ్మోవ్ నీ యవారం!" అంటున్నాడు అయ్య.

"యవారమా? సెబతాలే పద-"

"ఇదేంది - యాడకి అటుబోతావు. తలుపుకాడికే?" అంటుండాడు అయ్య.

"ఎంకయ్యకాడ నాకూ పనుంది. ఎల్దాం పదా" అంది అమ్మ.

"ఎంకయ్యా! ఎంకయ్య ఎవురూ? అయితే ఎంకయ్యని అట్టుంచు. ఇదిగో నమ్మోవ్, నువు బొమ్మలాట గిమ్మలాటకని పచ్చకోకగట్టి బయిలెల్తుండవుగావాcల మరదేందో-" అన్నాడు అయ్య.

"ఎంకయ్య ఎవురంటం కాడికొచ్చిందీ? అయితే ఎఱ్ఱకండవా ఏసింది బొమ్మలాటకాడికా అయ్యా? హుc అంత దొంగసాటుగా ఎల్లాల్సొచ్చిందా అయ్యా! నాకు తెలవదనుకుండా నీ ఏసిగాలూ-వుండు తెల్లార్లెగుస్తే మావూరు మా అమ్మ అయ్యకాడి కెల్లకబోతే సూడు. ఎల్లకబోతే నా పేరు దురగమ్మ కాదనాల్సిందే. ఎంతన్నాయం!

ఎంతమాయా! అన్నీ దొంగమాటలే, అంతా బూటకమే, మామ్మా, మా అయ్యేగనక వుంటే ఈ మడిసి ఇట్టా జేత్తాడూ- హుంహూం- అమ్మాం!"

"దురగమ్మ తల్లీ యాడవమాకే నీకు దణ్ణం పెడతా, బుద్ధి గెడ్డితిందిలేవే-"

"వుండూ-నన్నంటుకోమాకా-అమ్మా-"

"పెద్దగా అరవమాకే తల్లా- యీ సూరాయన్నా వొత్తే బాగుండు. యదవ రాడేం ఏ యాలకూ- బొమ్మలాట కెల్దాం యిగవూరుకోవే-"

"ఏం అక్కర్లా, నువే ఎల్లు ఎఱ్ఱకండవాతో. సూరాయి, నేనూ ఎటుబోతే నీకేం?"

"అహం, అదుగందుకే - ఎదవ పనే జేశా - యాడో గజ్జెల సప్పుడవుతుందే- యీ సూరాయివొత్తే బాగుండు. దొబ్బున బొమ్మలాట కెల్లొచ్చు - పాటలు యినొస్తుండయి మొదలుబెట్టలేదుగందా-ఎవురాడా సూరాయి? ఏందిరా తలకాయిలోనికి బెట్టి అట్ట సూత్తుండావూ-చా యదవా-దబ్బున రామంటుంటే - ఎంకట్బుబ్బయ్యగారితో సెప్పొచ్చావంట్రా?

'మరే - ఆరు అటెల్తీనీ-' అన్నాడు సూరాయి లోనకొచ్చి అటనే గోడ కానుకుని యీపు రుద్దుకుంటా.

'చాయదవా-' అంటున్నాడు అయ్య.

"ఆడిమీదికి లెగవమాక వుత్తపున్నానికి - యాడుండదిరా నీ గళ్ళ సొక్కాయా- ఎల్లి ఏసుకోవేందిరా!" అంది అమ్మ కళ్ళు ఆడిస్తా.

"ఆ పెట్టిలో వుంది ఏసుకోవేరా దొబ్బునా?" అన్నాడు అయ్య.

ఆమయిన బయల్దేరం బయల్దేరం దార్లో అమ్మా అయ్యల్ని సందుసూసుకుని సల్లగాదాటేసి, బొమ్మలాట పందిరికి అసంట అల్ల జేజికాడ కూకుని అటిటు నిక్కినిక్కి జూత్తున్న సీతాయి జడతోక ఎనకమాలే ఎల్లి గబిక్కిన ఓ గుంజు గుంజి, సెక్కలు, చీరేకుడబ్బాలు దన్దనామంటా కేతిగాడు, బంగారక్క తెర మీనకు వొచ్చేయాలకి; యాపసెట్టుమీన కూకుండ కొండాయి ముటాను ఎడాపెడా తోసుకుంటా ఎల్లి సెట్టు మయాన వాలుకొమ్మమీన కూకుండాడు సూరాయి.